క్లుప్తంగా

శ్రీవారిని దర్శించుకున్న బుర్రా కుటుంబం



వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న బుర్రా కుటుంబం

కందుకూరు: ఎన్నికల ప్రచారంలో తీరిక లేకుండా గడిపిన వైఎస్సార్ సీపీ అభ్యర్థి బుర్రా మధుసూదన్‌యాదవ్ ఎన్నికలు ముగియడంతో గురువారం కలియుగ దైవం వెంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. బుర్రాతో ఆయన సతీమణి లక్ష్మీ, ఇతర కుటుంబ సభ్యులు స్వామివారిని దర్శించుకున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు: పట్టణంలోని ఉప్పుచెరువు 11కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్‌లైన్‌కు అడ్డంగా ఉన్న చెట్లను తొలగించే ప్రక్రియలో భాగంగా శుక్రవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ టీవీ నరసింహం ఫీడర్ పరిధిలోని జనార్దనకాలనీ, దుర్గమ్మ టెంపుల్, మగ్గాల మిల్లు ఏరియా, ఉప్పుచెరువు, ఏకలవ్యనగర్, బృందావనం, మాయాబజార్ ప్రాంతాల్లో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

నేడు వైఎస్సార్ సీపీ మండల సమావేశం

కనిగిరి రూరల్: వైఎస్సార్ సీపీ మండల నాయకుల సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక పార్టీ కార్యాలయంలో జరుగుతుందని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి తెలిపారు. సమావేశానికి వైఎస్సార్ సీపీ కనిగిరి ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ హాజరవుతారని చెప్పారు. మండలంలోని 25 పంచాయతీల్లో ఉన్న వైఎస్సార్ సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ముఖ్య నాయకులు తప్పక హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఉరుములు, మెరుపులతో మోస్తరు వర్షం



పామూరులో కురుస్తున్న వర్షం

పామూరు: మండల కేంద్రమైన పామూరుతో పాటు మండలంలోని పలుగ్రామాల్లో గురువారం మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన మోస్తారు వర్షం కురిసింది. తీవ్ర ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతుండగా ఈ నెల 13వ తేదీ నుంచి మండలంలో వర్షాలు కురుస్తుండటంతో ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. వర్షంతో ఆటు బత్తాయి, నిమ్మ సాగు రైతులతో పాటు పశుపోషకులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో స్పోకెన్ ఇంగ్లిష్ తరగతులు

సీఎస్‌పురం(పామూరు): ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఇంగ్లిష్ మీడియంలో రాణించేందుకు ప్రత్యేక తరగతులు, స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణా తరగతులు ఎంతో ఉపకరిస్తాయని కోవిలంపాడు ఎంపీయూపీ పాఠశాల హెచ్ఎం బి.శివప్రసాదాచారి అన్నారు. మండలంలోని కోవిలంపాడు ఎంపీయూపీ పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్ఎం బి.శివప్రసాద్ అధ్యక్షతన స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్ఎం మాట్లాడుతూ కోవిలంపాడు సర్పంచ్ షేక్.ఖాదర్‌బీబుజ్జి సొంత ఖర్చులతో మూడేళ్లుగా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారన్నారు. పాఠశాల విద్యార్థులతో పాటు ఇతర ప్రాంతాల విద్యార్థులు వేసవి ప్రత్యేక ఆంగ్ల శిక్షణ తరగతులను ఉపయోగించుకోవాలన్నారు. పాలపర్తి నారాయణరావు, అమడసాని కేశవరెడ్డి, గోను రాజశేఖర్‌రెడ్డి, మునగల నారాయణరెడ్డి, ఏలిక నాగేశ్వరరావుయాదవ్, కె.అంకయ్యయాదవ్, చందులూరి కాశయ్య, దోలా తిరుపతయ్య, షేక్.అబ్దుల్, షేక్.గఫూర్, ఉపాధ్యాయుడు ఏసయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 18 గొర్రెలు మృతి

జరుగుమల్లి(సింగరాయకొండ): కుక్కలదాడిలో 18 గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన గురువారం జరుగుమల్లి మండలం ఎడ్లూరుపాడులో జరిగింది. బాధితుల కథనం ప్రకారం..ఎడ్లూరుపాడు గ్రామానికి చెందిన పొరాబత్తిన మాల్యాద్రి తన పొలంలో కంచె ఏర్పాటు చేసి గొర్రెలను భద్రపరిచాడు. కాపలా ఎవ్వరూ లేని సమయంలో కుక్కలు కంచె తొలగించుకుని గొర్రెలపై దాడి చేయడంతో గొర్రెలు మొత్తం చనిపోయాయని సుమారు రూ.1.50 లక్షల నష్టం వాటిల్లిందని మల్యాద్రి ఆవేదన వ్యక్తం చేశారు. తనకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందేలా అధికారులకు విజ్ఞప్తి చేశారు.



ఉలవపాడులోని వేణుగోపాలస్వామి దేవస్థానం



ఆలయం లోపల పందిళ్లు వేసిన గుడి

వేణుగోపాలునికి బ్రహ్మోత్సవ వైభవం



రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలుడు



బ్రహ్మోత్సవాల కోసం చలువ పందిళ్లు వేస్తున్న కూలీలు

- నేటి నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలు
- 24న రథోత్సవం

ఉలవపాడు: ఉలవపాడులో వెలసియున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉలవపాడు తిరునాళ్లగా పేరుగాంచిన ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. 17వ తేదీ రాత్రి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. 18న ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు చప్పర సేవ, శేషవాహనం, 19న ఉదయం 9.30 గంటలకు చప్పరసేవ, రాత్రి 9 గంటలకు హంసవాహనం, 20న ఉదయం 9.30 గంటలకు చప్పరసేవ, రాత్రి 9 గంటలకు హంసవాహనం, 21న రాత్రి 8 గంటలకు పొన్నమాను, రాత్రి 2 గంటలకు హనుమంతసేవ, 22న రాత్రి 8 గంటలకు మోహినీ ఉత్సవం, రాత్రి 2 గంటలకు గరుడ వాహనసేవ, 23 న ఉదయం 9 గంటలకు సూర్య ప్రభ వాహనం, సాయంత్రం 6 గంటలకు చంద్ర ప్రభ వాహనం, తెల్లవారుఝామున 4 గంటలకు ఏనుగుసేవ, 24న ఉదయం 10 గంటలకు స్వామి కళ్యాణం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, 25న ఉదయం 9 గంటలకు చప్పరసేవ, రాత్రి 9గంటలకు దొంగలదోపు, 26న ఉదయం 9 గంటలకు ముసుగుల సేవ, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణం, 27న రాత్రి 9 గంటలకు ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

సాంస్కృతిక కార్యక్రమాలు ఇవీ...

ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. 21న రాత్రి 9 గంటలకు భరతనాట్యం, 22న రాత్రి 9 గంటలకు దేవనర్తకి పూర్తి నాటకం, 23న 8 గంటలకు కోలాటం ప్రదర్శన, 10 గంటలకు రామాంజనేయ యుద్ధం సీను ప్రదర్శన, 11 గంటలకు గయోపాఖ్యానం యుద్ధ సీను ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరారు.

దేవస్థాన వేలంపాట ఆదాయం రూ.10.34 లక్షలు

- వసతులు కల్పించాలని వేలం పాటదారుల డిమాండ్
- పట్టీపట్టనట్లు వ్యవహరించిన అధికారులు



పాతసింగరాయకొండ దేవస్థానంలో వేలంపాట నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

సింగరాయకొండ(మర్రిపూడి): సింగరాయకొండ మండలం పాతసింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానంలో వచ్చే నెలలో జరిగే బ్రహ్మోత్సవాలకు సంబంధించి జెయింట్ వీల్స్ ఏర్పాటు, కొబ్బరికాయలు, కొబ్బరి చిప్పలుపోగు చేసుకునేందుకు వేలంపాట నిర్వహించారు. వేలం పాటలో జెయింట్ వీల్స్ ఏర్పాటుకు అత్యధికంగా రూ.9 లక్షల వేలంపాట జరగ్గా, గత సంవత్సరం రూ.8.61 లక్షల ఆదాయం వచ్చింది. కొబ్బరి చిప్పలు పోగు చేసుకోవటానికి రూ.83 వేలు, కలకండ, ఐస్‌క్రీమ్స్ అమ్మకానికి రూ.51 వేల జరిగింది. కొబ్బరికాయలు, కూల్‌డ్రింక్స్ అమ్మకానికి సంబంధించి గత సంవత్సరం వేలం కన్నా పాటదారులు ముందుకు రాకపోవటంతో ఆ రెండింటికి సంబంధించి మళ్లీ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి.కృష్ణవేణి తెలిపారు. కొబ్బరికాయలు అమ్మకానికి సంబంధించి మేము వేలం పాటుకుంటున్నామని, కానీ ఆలయ అధికారులు పట్టించుకోకపోవటంతో గ్రామస్తులు ఇళ్లలో కొబ్బరికాయలు అమ్ముతున్నారని, దీంతో మేము ఆర్థికంగా నష్టపోతున్నామని అధికారులు చర్యలు తీసుకోనప్పుడు మేము అధిక ధరలు పెట్టి పాట ఏ విధంగా పాడుకోవాలని ప్రశ్నించారు. గత ఏడాది కొబ్బరికాయల పాట రూ.1.52 లక్షలకు పాడానని, కానీ ఇతరులు అమ్మటంతో సుమారు రూ.50 వేలు నష్టపోయాయని పాటదారులు ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే జెయింట్ వీల్ ఏర్పాటు చేసే ప్రదేశంలో విద్యుత్ తీగల సమస్య ఉందని వాటిని తొలగిస్తే పాట ఇంకా పెరిగే అవకాశం ఉందని చెప్పినా అధికారులు పట్టించుకోలేదని వాపోయారు. వేలం పాటదారులకు పూర్తి సౌకర్యాలు కల్పించి వేలం పాటల ద్వారా దేవాలయానికి ఆదాయం పెంచాల్సిన అధికారులు తూతూ మంత్రంగా వేలం పాటలు నిర్వహించి చేతులు దులుపుకోవటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కందుకూరు దేవదాయ ఇన్‌స్పెక్టర్ సత్యన్నారాయణ, ఆలయ చైర్మన్ పామర్తి మాధవరావు, అర్చకులు ఉదయగిరి లక్ష్మీనరసింహాచార్యులు పాల్గొన్నారు.

నీటి సమస్య లేకుండా చర్యలు



వార్డుల్లో పర్యటిస్తున్న చైర్మన్ అబ్దుల్ గఫార్

కనిగిరి రూరల్: పట్టణంలోని ఎక్కడా నీటి సమస్య తలెత్తకుండా తక్షణ చర్యలు తీసుకుంటామని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అన్నారు. పట్టణంలోని 4,5 వార్డుల్లో గురువారం చైర్మన్ అబ్దుల్ గఫార్, కౌన్సిలర్లు పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను చైర్మన్‌కు వివరించారు. అనంతరం చైర్మన్ గఫార్ మాట్లాడుతూ తీవ్ర నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపడుతున్నామని, 4,5 వార్డుల్లో డీ బోర్ వెల్ ద్వారా నీటి సమస్య శాశ్వత పరిష్కారంకు చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. కౌన్సిలర్ ఎర్రబల్లి దేవరాజ్, పార్టీ నాయకులు నరసయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తెగిన విద్యుత్ లైన్

పీసీపల్లి : స్థానిక ఎస్సీ కాలనీలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి సమీపంలోని 11కేవీ విద్యుత్ మెయిన్ లైన్ తెగి చెట్ల మీద పడింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పినట్లయింది. మెయిన్ లైన్ కావడంతో ఎప్పుడు ఏం జరుగుతుందో అని ప్రజలు బిక్కుబిక్కుమని కాలం గడుపుతున్నారు. గతంలో ఇదే మాదిరిగా జరిగినప్పుడు చంద్ర అనే వ్యక్తి కరంటు షాక్ గురై మరణించిన సంఘటన ప్రజలు గుర్తు తెచ్చుకుని భయాందోళన చెందుతున్నారు. విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదం జరగకుండా ఉండేందుకు విద్యుత్ లైన్ మరమ్మత్తులు చేసి తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

వైఎస్సార్ సీపీ కార్యకర్తపై దాడి

వెలిగండ్ల: మండలంలోని పందువ ఎస్సీకాలనీలో వైఎస్సార్ సీపీ కార్యకర్తపై టీడీపీ కార్యకర్త దాడికి దిగాడు. ఈ సంఘటన గురువారం జరిగింది. గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త కుమ్మరికుంట గురవయ్య కుమారుడు షెడ్రక్‌పై టీడీపీకి చెందిన జటికె తిమోతి పాత కక్షలను మనసులో ఉంచుకొని దాడికి దిగాడు. షెడ్రక్‌కు గాయాలయ్యాయి. షెడ్రక్ తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలి



మండల సర్వసభ్యసమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ పులి రమేష్

గుడ్లూరు: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలని ఎంపీపీ పులి రమేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలుశాఖల అధికారులు తమశాఖలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజాప్రతినిధులకు వివరించారు. వ్యవసాయాధికారి రవికుమార్ మాట్లాడుతూ రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు గ్రామ సచివాలయాల్లోని రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉంచామన్నారు. విత్తనాలకు, ఎరువులకు ఎంటాంటి కొరత లేదన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ రాజశేఖర్ మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో ఎక్కడా నీటి సమస్య లేదన్నారు. చేతి పంపులు అవసరమైన గ్రామాల్లో వేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. రాళ్లపాడు ప్రాజెక్టు నుంచి కర్లపాలెం గ్రామానికి మంచినీరు సరఫరా కావడంలేదని సాలిపేట సర్పంచ్ దాపల రమణయ్య జేఈ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని వైద్యాధికారి మారుతీరావు తెలిపారు. ఎంఈఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం నుంచి గుడ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జూనియర్ ఇంటర్ తరగతులు ప్రారంభిస్తామని, మొదటి సంవత్సరం ఎంపీసీ, సీఈసీ క్లాసులు జరుగుతాయన్నారు. ఎంపీపీ పులి రమేష్ మాట్లాడుతూ అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తూ మండల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, కోఆప్షన్ సభ్యుడు రషీద్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డెంగీ నివారణకు కృషి చేయాలి



సింగరాయకొండలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ



ర్యాలీలో మాట్లాడుతున్న వైద్యులు

కనిగిరి రూరల్: డెంగీ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రభుత్వ వైద్యశాల ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట సుబ్బయ్య అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పట్టణంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి రామాంజనేయులు ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ దోమల వ్యాప్తిని అరికట్టాలని, దోమలకు కుట్టకుండా దోమ తెరలు వాడాలని, పరిసరాల పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలని చెప్పారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. ఏడీఎస్ అనే ఆడదోమ డెంగీ, చికెన్ గున్యా వస్తాయని వివరించారు. డాక్టర్లు ప్రియార్షానందా, ఫణి, డీపీఎంఓ ప్రసాద్‌రెడ్డి, పారాలీగల్ వలంటీర్లు మంద్రు రమేష్, నవకుమార్, రాజేష్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సింగరాయకొండ(మర్రిపూడి): నిల్వ ఉన్న మంచి నీటిలో డెంగీ దోమ పెరుగుతుందని, నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు పాటించి డెంగీ జ్వరాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ వంశీధర్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా సింగరాయకొండ ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ చైతన్యకృష్ణ మాట్లాడుతూ కొబ్బరిబొండాలు, పాత టైర్లు, పాత నీటితొట్లు వంటి వాటిలో వర్షం నీరు నిల్వ ఉంటుందని, వాటిలో డెంగీ వ్యాధి కారక దోమ వృద్ధి చెందుతుందని, నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వద్ద నుంచి కందుకూరు రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఉజ్వల, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలి



టంగుటూరులో వేలంలో పాల్గొన్న వ్యాపారులు

టంగుటూరు: పొగాకు గ్రేడింగ్ సమయంలో అన్య పదార్థాలు లేకుండా చూసుకోవాలని, అలాంటి బేళ్లకు అధిక ధరలు పొందవచ్చని వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక పొగాకు వేలం కేంద్రంలో గురువారం రైతులకు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం నిర్వహించిన వేలంలో పొందూరు క్లస్టరు గ్రామాలకు చెందిన రైతులు 1047 బేళ్లను వేలానికి తీసుకురాగా 1008 కొనుగోలు చేసి, 39 బేళ్లను తిరస్కరించారు. గరిష్ఠ ధర రూ.301, కనిష్ఠ ధర రూ. 205 పలకగా, సరాసరి రూ. 264.59 ధర పలికింది. వేలంలో మొత్తం 35 మంది వ్యాపారులు పాల్గొన్నారు.

కనిగిరిలో మంచి మెజారిటీ సాధిస్తాం



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న దద్దాల నారాయణ

- దద్దాల నారాయణ యాదవ్

పీసీపల్లి: కనిగిరిలో గతంలో కంటే మెరుగైన ఫలితాలు వస్తాయని వైఎస్సార్ సీపీ అభ్యర్థి దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. స్థానిక వైఎస్సార్ భవన్‌లో గురువారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో కష్టించి పని చేసిన ప్రతి ఒక్కరినీ గుర్తించుకొని తగిన విధంగా గుర్తింపునిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ గోపవరపు బొర్రారెడ్డి, ఎంపీపీ ఆత్యాల జువన్య, జెడ్పీటీసీ పెద్దిరెడ్డి లక్ష్మీకాంతం, పరిమి వెంకట్రావ్, మాజీ ఎంపీపీ బత్తుల అంజయ్య, మాజీ వైస్ ఎంపీపీ డబ్బుగొట్టు మహేష్ నాగ్, మూలె రాజశేఖర్ రెడ్డి, కొండ్రు నరసింహారావు, వేణు, కేతినేని నాగేష్, మూలె బుల్లిరెడ్డి, దేవండ్ల కస్త, ఓబులరెడ్డి, లక్ష్మీరెడ్డి, అనిల్ ఉన్నారు.

కనులపండువగా కల్యాణోత్సవం



కల్యాణోత్సవంలో తాళిచూపుతున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లె కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం సీతా సమేత కోదండరామస్వామి శాంతి కల్యాణోత్సవం రుత్వికుల వేదమంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సీతా, రాముల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం వేడుకగా ఎదురుకోల నిర్వహించి కల్యాణ మండపంపై వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా భజంత్రీల మేళతాళాల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, గ్రామోత్సవం వైభవంగా సాగింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో గాయాలు



ప్రమాదస్థలంలో పడి ఉన్న క్షతగాత్రుడు

వెలిగండ్ల: మండలంలోని పద్మాపురం మలుపు వద్ద ఆగి ఉన్న జేసీబీని ఢీకొట్టి ఒకరికి తీవ్ర గాయాలైన సంఘటన గురువారం సాయంత్రం జరిగింది. సీఎస్‌పురం మండలం వెంగనగుంట చెందిన జె.చెన్నకేశవులు కనిగిరి నుంచి వెంగనగుంటకి ద్విచక్రవాహనంపై వెళ్తున్నాడు. పద్మాపురం మలుపు వద్ద ఆగి ఉన్న జేసీబీని ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. క్షతగాత్రుడు చెన్నకేశవులను 108 సిబ్బంది చికిత్స నిమిత్తం కనిగిరికి తరలించారు.

సూరావారిపల్లి వద్ద..

మండలంలోని సూరావారిపల్లి వద్ద రోడ్డు ప్రమాదం గురువారం రాత్రి జరిగింది. సూరావారిపల్లికి చెందిన రఘునాథరెడ్డి గురువారం రాత్రి గ్రామంలో తారురోడ్డుపై నిలబడి ఉన్నాడు. రామగోపాలపురం నుంచి ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళ్తూ ఉండగా బైక్ తగిలి రఘునాథరెడ్డికి గాయాలయ్యాయి. 108 సిబ్బంది క్షతగాత్రుని కనిగిరి తరలించారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న శేషుకుమార్

గుడ్లూరు: మండలంలోని రామాయపట్నం చర్చి కాంపౌండ్ క్రీడా మైదానంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను రామాయపట్నం పోర్టు జనరల్ మేనేజర్ శేషుకుమార్, సాలిపేట సర్పంచ్ దాపల రమణయ్యలు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా శేషుకుమార్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ఆరోగ్యానికి దోహదపడతాయన్నారు. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ స్నేహపూరితంగా ఆటలు ఆడాలన్నారు. దాపల రమణయ్య మాట్లాడుతూ క్రికెట్ పోటీల్లో 36 జట్లు పాల్గొంటాయన్నారు. మొదటి బహుమతి రూ.20116, రెండవ బహుమతి రూ.10116 గెలుపొందినవారికి అందజేస్తామన్నారు. కరుణకుమార్, వరకుమార్, సన్నీ, సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహిస్తామన్నారు.

విద్యార్థులకు పోటీలు

ఉలవపాడు: ఉలవపాడులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు 100 మీటర్ల పరుగుపందెంనిర్వహించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా విద్యార్థులకు శారీరక దృఢత్వంలో భాగంగా పోటీలు నిర్వహించారు. పోటీల్లో 14 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ముందుగా విద్యార్థులతో నీతికథలు విజ్ఞానాన్ని అందించే పుస్తకాలు, జాతీయనాయకులు జీవిత చరిత్రలు చదివించారు. కార్యక్రమంలో గ్రంథపాలకుడు దాసరికోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంకమ్మతల్లి ఆలయానికి విరాళాలు

కందుకూరు: గ్రామదేవత అంకమ్మతల్లి ఆలయ పునర్నిమానికి భక్తుల నుంచి విరాళాల పరంపర కొనసాగుతూనే ఉంది. ఇప్పటికే ఆలయ మొదటి దశ నిర్మాణం పూర్తి కాగా, రెండవ దశ నిర్మాణమైన అనివేటి మండప నిర్మాణానికి భక్తుల నుంచి పెద్ద ఎత్తున విరాళాలు అందుతున్నాయి. దీనిలో భాగంగా హైదరాబాద్‌లో నివసిస్తున్న ఎస్ఎస్‌వీ కన్‌స్ట్రక్షన్స్ నిర్వాహకులు ముప్పరాజు శ్రీను, దివి వసంతకుమార్‌లు రూ.1,01,116 విరాళం అందజేశారు. అలాగే పట్టణానికి చెందిన కిలారి శ్రీనివాసులు, సులోచన దంపతులు రూ.25,116 విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యుడు ఎనిమిరెడ్డి వెంకటరెడ్డికి అందజేశారు. ఆలయ నిర్మాణం సుందరంగా జరుగుతుందని, రూ.6 కోట్ల ఖర్చుతో ప్రస్తుతం అనివేటి మండప నిర్మాణం జరుగుతుందని వివరించారు.